పట్టుదల, లక్ష్యంతో చదవాలి



విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: పట్టుదల, లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధించవచ్చని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మౌలాలిలోని సెంటర్‌ ఫర్‌ ఎక్సలెన్స్‌ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్‌ కళాశాల సికింద్రాబాద్‌లో శిక్షణ తీసుకున్న పలువురు విద్యార్థులు లాసెట్‌లో మంచి ర్యాంక్‌లు సాధించారు. రాష్ట్రస్థాయిలో 9 వ ర్యాంక్‌ సాధించిన అమతుల్లా వహీదా, ఇంటర్‌ మొదటి సంవత్సరంలో సీఈసీ గ్రూప్‌లో 492 మార్కులు సాధించిన శ్రావ్యను శనివారం అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ కవిత, కోఆర్డినేటర్‌ సరస్వతి, జ్యోతి రాణి, శిక్షకులు అమన్‌, సంతోష్‌ పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు వేగవంతం చేయాలి

మల్కాజిగిరి: నాలా విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. బాలసరస్వతీనగర్‌, సర్ధార్‌ పటేల్‌నగర్‌కాలనీల్లో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా విస్తరణలో ఇండ్లు కోల్పోయిన 72 మందిని ఆదుకోవాలన్నారు. ఇదిలాఉంటే పలువురు స్థానికులు రైల్వే ఖాళీ ప్రదేశం (డెడ్‌ఎండ్‌) వద్ద ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలను పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే ఎస్పీనగర్‌ బాల సరస్వతీనగర్‌ వరకు నూతన నాలా నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధ చేయాలని సూచించారు. ఈఈ లక్ష్మణ్‌, డీఈ మహేశ్‌, ఏఈ దీపక్‌, వీఐ రమేశ్‌, నాయకులు జగదీష్‌గౌడ్‌, వెంకన్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కు అందజేత

అల్వాల్‌: అల్వాల్‌కు చెందిన పద్మకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ కింద రూ.33 వేలు మంజూరు కాగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ శాంతితో కలిసి బాధిత కుటుంబసభ్యులకు శనివారం చెక్కును అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



కమిషనర్‌ రాంలింగంకు డ్రైనేజీ పనులను వివరిస్తున్న జంగారెడ్డి

బోడుప్పల్‌: 18వ డివిజన్‌లో జరుగుతున్న అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను బోడుప్పల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ రాంలింగం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. ఇదిలాఉంటే విద్యుత్‌ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించి అక్కడే పడేశారని ఈస్ట్‌ హనుమాన్‌నగర్‌ కాలనీ అధ్యక్షుడు పులకండ్ల జంగారెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్‌ స్పందించి మున్సిపల్‌ సిబ్బందితో వాటిని తొలగించారు. కార్యక్రమంలో డీఈ బాల మురళి, ఉదయ నగర్‌ కాలనీ అధ్యక్షుడు యాదన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహిపాల్‌, కాంట్రాక్టర్‌ గొడిశాల శ్రీనివాస్‌గౌడ్‌, కాలనీవాసులు గడ్డం నరేంద్రకుమార్‌, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఎల్‌వీ మ్యూజిక్‌, అండ్‌ డ్యాన్స్‌ అకాడమీ గురువు చింత నాగార్జున శిష్య బృందం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను కట్టి పడేసింది. చూడరమ్మ సతులారా.. బోశంభో వేంకటేశుడు, తర తరాల తిరుమల, స్వాగతం కృష్ణ, గోదావరి అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మెరుగైన సేవలు అందిస్తాం

గౌతంనగర్‌: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ది సిటిజన్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ వెస్ట్‌ మల్కాజిగిరి శాఖ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కేవీ సుబ్బయ్య అన్నారు. గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌పేట్‌ కమ్యూనిటీ హాల్‌లో ఖాతాదారుల సమావేశం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై గతేడాది జరిగిన ఆర్థిక లావాదేవీలు, ఈ యేడు ఖాతాదారులకు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఖాతాదారుల సహాయ సహకారాల వల్లే నంబర్‌ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌ చైర్మన్‌ వైస్సార్‌ మూర్తి, డైరెక్టర్‌ ఏ. సోమలింగంగౌడ్‌, మేనేజర్‌ ఎస్‌.ఎం. పీరాన్‌, ఏవీ. స్వామితోపాటు ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్‌ చాలీసా పారాయణం

అల్వాల్‌: అల్వాల్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్‌ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హనుమాన్‌ చాలీసా పారాయణంతో భక్తి భావం పెంపొందడమే కాకుండా ప్రతిఒక్కరిలో క్రమశిక్షణ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కిషన్‌, దేవేందర్‌రెడ్డి, వెంకన్న, పాండురంగారావు, కిశోర్‌కుమార్‌, భూపాల్‌ రెడ్డి, రమేశ్‌, చందన, రుపా, అంజలి, దేవేందర్‌రావు, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్‌ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్‌ పరిధిలోని అరుణ్‌నగర్‌, వినాయకనగర్‌ ఫేజ్‌–3లో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన వెంట కాప్రా డివిజన్‌ కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌, జలమండలి డీజీఎం సతీశ్‌, ఏఈ రోహిత్‌ బీఆర్‌ఎస్‌ నేత బైరీ నవీన్‌ గౌడ్‌, కాలనీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

మల్లాపూర్‌: మల్కాజిగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. నాచారం డివిజన్‌కు చెందిన కాలనీవాసులు, సీనియర్‌ సిటిజన్స్‌, అసోసియేషన్‌ ప్రతినిధులు శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కలిసిన వారిలో కార్తీకేయనగర్‌, భవానీనగర్‌, స్నేహపురి కాలనీ, శ్రీనగర్‌కాలనీ, సావర్కర్‌నగర్‌ కాలనీ, నాచారం ఓల్డ్‌ విలేజ్‌ సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు సాయిబాబా, శ్రీశైలం, దత్తారెడ్డి, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, సురేందర్‌, భూపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విష్ణు, ప్రతాప్‌, బీజేపీ నేతలు పద్మారెడ్డి, రాగిరి మోహన్‌రెడ్డి, అనితారెడ్డి, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో నాచారం వాసులు

వయోవృద్ధులను గౌరవించాలి

అల్వాల్‌: 'మేము పెద్దవాళ్లం.. మీ పెద్దలం మమ్మల్ని వేధించకండి.. గౌరవించండి' అంటూ అల్వాల్‌ వయోవృద్ధుల సంఘం ప్రతినిధులు కోరారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన ర్యాలీ దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఓల్డ్‌ అల్వాల్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యవ్వనంలో సంపాదించినదంతా పిల్లలకు ధారపోసి చివరి దశలో తీవ్ర ఇబ్బందులకు గురికావస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకుండా ఉండాలని అవగాహన కల్పించేందుకే ర్యాలీ తీశామని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సౌందరేశ్వర్‌, సుదర్శన్‌రావు తదితరులు ఉన్నారు.

హోమ్‌.. హోప్‌..



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వం డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి.. లబ్ధిదారులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గృహలక్ష్మి పథకంలో మంజూరు చేసిన లబ్ధిదారుల జాబితా రద్దయ్యింది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రజల నుంచి దరఖాస్తులను కొత్త ప్రభుత్వం స్వీకరించింది. అలాగే, ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో కూడా ఇందిరమ్మ ఇళ్లపై కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ ముగియడంతో వీటిపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభిస్తోంది. అలాగే, గతంలోని ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు కార్యాచరణ రూపొందిస్తోంది. వీటితో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. పారదర్శకత కోసం లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సొంతింటి కల నెరవేరేదెన్నడో?

- అసంపూర్తిగానే 'డబుల్‌' ఇళ్లు
- నిరాశ పరిచిన గృహలక్ష్మి పథకం
- జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు
- జిల్లాలో దరఖాస్తులు 1.10 లక్షలు
- ఆశగా ఎదురుచూస్తున్న పేదలు

అసంపూర్తిగా డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు నిర్మిస్తున్న డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల నిర్మాణ పనులు పడకేశాయి. గృహలక్ష్మి పథకం ప్రవేశంతో డబుల్‌ ఇళ్ల నిర్మాణాలపై ఆశలు అడియాశలయ్యాయి. జిల్లాలోని అర్బన్‌ ప్రాంతమైన జీహెచ్‌ఎంసీ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో డబుల్‌ బెడ్‌ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం కాగా, అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తయిన ఇళ్లను టాంపర్‌ సాఫ్ట్‌వేర్‌ పద్ధతిలో పంపిణీ చేశారు. (ఇందులో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను మేడ్చల్‌ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్మించినవి కూడా పంపిణీ చేశారు.) అర్బన్‌ అసెంబ్లీ నియోజకవర్గాలైన ఉప్పల్‌, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌, కూకట్‌పల్లి పరిధిలో మొదటి దశలో ప్రతి సెగ్మెంట్‌కు 500 చొప్పున 2 వేల మందికి డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను కేటాయించారు.

ఇళ్లపై స్పష్టత లేకపోవడంతో..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా రూరల్‌ ప్రాంతానికి సంబంధించి అప్పటి ప్రభుత్వం 2,350 డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 683 ఇళ్లు పూర్తి కాగా, ఇందులో 300 ఇళ్ల వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే, మిగతా 340 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉండగా, మరో 1,329 డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు వివిధ నిర్మాణ దశలతో పాటు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి డబుల్‌ రూమ్‌ ఇళ్లపై స్పష్టత లేకపోవడంతో కేటాయింపుపై సందిగ్ధం నెలకొంది.

నిరాశపరిచిన గృహలక్ష్మి పథకం

ఇంటి స్థలం ఉండి ఆహారభద్రత కార్డు పొంది.. ఎలాంటి పక్కా ఇల్లు లేని వారి నుంచి గృహలక్ష్మిలో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 17,090 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 12,040 మంది లబ్ధిదారులను గుర్తించారు. జిల్లాలో ఒక్క మేడ్చల్‌ అసెంబ్లీ నియోజకవర్గంలోనే 1200 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మీ పథకం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటి కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఇళ్ల పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో గృహలక్ష్మీ లబ్ధిదారులు నిరాశకు గురయ్యారు.

ఇందిరమ్మ ఇళ్లతో చిగురించిన ఆశలు

అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదిలో 3,500 చొప్పున మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 17,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఎలాంటి నివాస గృహం లేక సొంతింటి స్థలం, ఆహారభద్రత కార్డు ఉన్న వారికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నారు. దీని కోసం ఆరు నెలలుగా లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించటంతో లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా జనవరి మొదటి వారంలో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించగా, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 7.09 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 1,10,228 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో.. నిరుపేద లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

డీఈ శారద బదిలీ

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ ఇంజినీరింగ్‌ విభాగం డీఈగా పని చేస్తున్న శారద శనివారం బదిలీ అయ్యారు. బోడుప్పల్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తుండగా ఆదిలాబాద్‌ పంచాయతీ రాజ్‌ శాఖకు ట్రాన్స్‌ఫర్‌ అయ్యింది. ఆమె స్థానంలో దమ్మాయిగూడ డీఈ చిరంజీవులు బోడుప్పల్‌లో బాధ్యతలు చేపట్టారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్‌–2 పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఈ నెల 16న (నేడు) పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పృథ్వీ రాజ్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఈసీ కంప్యూటర్స్‌ ఫీడర్‌ పరిధిలోని ఫేజ్‌–2 ఏరియా సెక్టార్‌–2 పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, 11 కేవీ పాయినీర్‌ ఫీడర్‌ పరిధిలోని ఫేజ్‌–2, ఏరియా సెక్టార్‌–1లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు.

చర్లపల్లి సబ్‌స్టేషన్‌–1 పరిధిలో..

చర్లపల్లి సబ్‌స్టేషన్‌–1 పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ రుచి, మైక్రో మీడియా ఫీడర్ల పరిధిలోని ఐడీఏ ఫేజ్‌–4, ఫేస్‌–5 కొంత భాగం, రైల్‌విహార్‌ కాలనీల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మంత్రి కృషి మరువలేనిది

మల్లాపూర్‌: రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా విదేశాల్లోని ప్రముఖ కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి పెట్టుబడులు వచ్చేలా ఒప్పించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కృషి మరువలేనిదని టీపీసీసీ అధికార ప్రతినిధి యేగేశ్వర్‌రెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి మామిడాల సంతోష్‌ రెడ్డి అన్నారు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన మంత్రిని శనివారం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో లోకేందర్‌ రెడ్డి, రమాకాంత్‌ రావు, తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి బాలికల పాఠశాలలో కార్పొరేటర్‌ శ్రవణ్‌ విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, నోట్‌ బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్‌గా ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సూచించారు.

ఉప్పల్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో..

ఉప్పల్‌: ఉప్పల్‌ జడ్పీ పాఠశాలలో ఉప్పల్‌ కార్పొరేటర్‌ మందుముల రజిత శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌ బుక్స్‌, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శీనయ్య, ఎల్లబెత్‌, సుదర్శన్‌ రెడ్డి, లక్ష్మణ్‌ రావు, కాంగ్రెస్‌ నాయకులు రామకృష్ణ, సల్ల ప్రభాకర్‌ రెడ్డి, అల్వాల భాస్కర్‌, జనగాం విజయ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ పాఠశాలలో..

కుషాయిగూడ: కుషాయిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి శనివారం విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో డ్రైనేజీ పరిశీలన..

భరత్‌నగర్‌ కాలనీలో తరచుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీని కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి పరిశీలించారు. శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

అల్వాల్‌: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని అల్వాల్‌ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మల రామారం గ్రామం జీవురాలతండాకు చెందిన ఇస్లావత్‌ పాండు, కేతావత్‌ బద్యతోపాటు భిక్షపతి ముగ్గురు కలిసి ఆటోల్లో సుమారు 28 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని తరలిస్తుండగా మచ్చబొల్లారంలో పట్టుకున్నారు. వీరిలో భిక్షపతి పారిపోగా మిగతా ఇద్దరిని అల్వాల్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రక్తదాన శిబిరం

బోడుప్పల్‌: బోడుప్పల్‌ పల్లవి మోడల్‌ స్కూల్‌లో రెడ్‌ క్రాస్‌ సంస్థ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆ స్కూల్‌ డైరెక్టర్‌ సుశీల్‌కుమార్‌ హాజరై మాట్లాడారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ తనూజ పాల్గొన్నారు.

మేయర్‌కు వినతిపత్రం

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ డివిజన్‌ కార్పొరేటర్‌ గున్నాల సునీతాయాదవ్‌ మేయర్‌ విజయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ దీన్‌దయాళ్‌నగర్‌లో గతంలో నాలాలో పడి బాలిక మృతి చెందిందని అయి నా నాలా విస్తరణ పనులు చేపట్టలేదన్నారు. మౌలాలి ఆర్టీసీ కాలనీ మెయిన్‌రోడ్డును తవ్వివదిలేశారని మరమ్మతులు చేపట్టాలన్నారు. బీజేపీ మౌలాలి డివిజన్‌ కార్యదర్శి శివ ఉన్నారు.

బోనాల పండుగకు ముందస్తు చర్యలు చేపట్టండి

మల్కాజిగిరి: బోనాల పండుగకు ముందస్తు చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి కార్పొరేటర్‌ శ్రవణ్‌ సూచించారు. తన కార్యాలయంలో ఇంజినీరింగ్‌ విభాగం అధికారులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి డివిజన్‌లోనే ప్రధాన ఆలయాలు ఉన్నాయని బోనాల పండుగను దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌ బండ్‌పై ఓపెన్‌ ఎయిర్‌ జిమ్‌కు మరమ్మతు చేయాలని, మురుగునీరు చెరువులో కలవకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఏఈ దీపక్‌, వీఐ రమేశ్‌ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి నాయకులు

ఉప్పల్‌: నేటి విద్యార్థులే రేపటి నాయకులు మల్కాజిగిరి ఏసీపీ సిద్ధి చక్రపాణి అన్నారు. ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థుల కేబినెట్‌ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థి నాయకులకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపాల్‌ పసల జోసెఫ్‌, ఉప్పల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌ రెడ్డి, ఎస్‌ఐ నెహ్రూ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

అల్వాల్‌: అల్వాల్‌ హిల్స్‌కాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ద్వారా తోరణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17న కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

బస్‌ను పునరుద్ధరించాలి

మల్లాపూర్‌: ఈసీఐఎల్‌ నుంచి మల్లాపూర్‌ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే 51 నంబర్‌ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ మల్లాపూర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కొప్పెర సాయిగౌడ్‌ కుషాయిగూడ డీఎం, అధికారులకు శనివారం వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మల్లాపూర్‌ అశోక్‌నగర్‌ బస్టాప్‌ కూలిపోవడంతో ప్రయాణికులు నిల్చునేందుకు నీడ లేక అవస్థలు పడుతున్నారు. అందజేసినవారిలో కోయకూర బాలరాజ్‌గౌడ్‌, కొకుంట్ల రూపేందర్‌రెడ్డి, వినిష్‌ యాదవ్‌ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రామంతాపూర్‌ : డివిజన్‌ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి జోనల్‌ కమిషనర్‌ పంకజకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్‌ తెలిపారు.

తండ్రి గొప్పదనం తెలుసుకోవాలి

బోడుప్పల్‌: పిల్లలు చిన్నప్పటి నుంచే తండ్రి గొప్పదనం, ప్రాధాన్యతను తెలుసుకోవాలని లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌ చైర్మన్‌ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫాదర్స్‌ డే దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

అల్వాల్‌: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని కార్పొరేటర్‌ శాంతి అన్నారు. ×స్వచ్ఛ సర్వేక్షణ్‌×లో భాగంగా ఎంఈఎస్‌ కాలనీ జీవీపీ పాయింట్‌ వద్ద కాలనీవాసులతో శనివారం ఆమె క్యారంబోర్డు ఆడుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కన్నాగౌడ్‌, జవాన్‌ ఇస్తారి, ఎస్‌ఎఫ్‌ఏలు వెంకటేశ్‌, భాస్కర్‌, విష్ణు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కో చైర్మన్‌ ఎల్‌ గోపాల్‌రావు అన్నారు. నేరేడ్‌మెట్‌ అంబేడ్కర్‌ భవన్‌లో మేడ్చల్‌ జిల్లా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ రూ 6 వేలకు పెంచాలన్నారు. అలాగే నూతన పింఛన్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో దివ్యాంగుల శాతం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌మాదిగ, జంగయ్య, మంగమ్మ, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.